ఢిల్లీకి ముడుపులిచ్చే పనిలో రేవంత్ బిజీ

కర్ణాటక నుంచి పది టీఎంసీల నీళ్లు తెచ్చే సోయి సీఎం, మంత్రులకు లేకపాయె: జగదీశ్‌రెడ్డి

- వ్యాపారులు, కాంట్రాక్టర్లను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు సంపాదించే పనిలో జిల్లా మంత్రి
- వందరోజుల కాంగ్రెస్ పాలనలో ఏమీ ఒరగలే
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆగ్రహం
- అన్నెపర్తిలో ఎండిన పంట పాలాల పరిశీలన

నల్లగొండ మండలం అన్నెపర్తిలో జగదీశ్‌రెడ్డికి ఎండిన పంట గురించి వివరిస్తున్న రైతు. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు

నల్లగొండ రూరల్, మార్చి 18: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులకు ఢిల్లీకి ముడుపులిచ్చే తపన తప్ప కర్ణాటక రాష్ట్రం నుంచి కనీసం 10 టీఎంసీల నీళ్లు తేవాలన్న సోయి లేదని రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. ఆ రాష్ట్రం నుంచి 10 టీఎంసీల నీటిని తెచ్చుకుంటే ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి ఉండేది కాదని చెప్పారు. నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం అన్నెపర్తి గ్రామంలో సోమవారం ఆయన ఎండిపోయిన పంట పొలాలు, నిమ్మ తోటలను మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ట్యాంకర్లతో పొలానికి నీరు పెడుతున్న రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా మంత్రికి వసూళ్ల మీద సోయి తప్ప రైతుల సమస్యల మీద లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వ్యాపారులు, కాంట్రాక్టర్లను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు సంపాదించే పనిలో ఉన్నారు తప్ప వంద రోజుల పరిపాలనలో ఒరిగిందేమీ లేదని మండిపడ్డారు.

ఇద్దరు మంత్రులవి ప్రగల్భాలే

మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రగల్భాలు పలుకడం తప్ప దేనికి పనికిరారని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. సూర్యాపేట, కోదాడతోపాటు అన్ని నియోజకవర్గాల్లో పూర్తిస్థాయిలో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ ప్రాజెక్టు కింద నీరు అందించే అవకాశం ఉన్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. నాగార్జునసాగర్ ఆయకట్టులో కూడా ఎగువన నారాయణపురం, ఆల్మట్టి డ్యామ్ నుంచి నీటిని తెప్పించి రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. పంట పొలాలు ఎండిపోవడంతో పెట్టుబడి పోయి రైతులు విలపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కరువుపై సర్వే చేయించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతుల ఉసురు తగిలి కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం అవుతుందని మండిపడ్డారు. ఆయన వెంట నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్, బీఆర్ఎస్ నల్లగొండ మండలాధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు బకరం వెంకన్న, తుమ్మల లింగస్వామి, పీఏసీఎస్ చైర్మన్ నాగరత్నం రాజు ఉన్నారు.

మా బతుకులు ఆగమైనయ్: మహిళా రైతు చంద్రమ్మ

పంట పొలాల పరిశీలనలో భాగంగా మహిళా రైతు చంద్రమ్మతో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడారు. ఎంత నాటు పెట్టావు.. ఎంత ఎండిపోయింది అని అడిగారు. చంద్రమ్మ విలపిస్తూ 'మా బతుకులు ఆగం అయినాయి సార్. మమ్మల్ని ఆదుకోవాలి. ఐదు ఎకరాలు ఉంటే బోర్లు సక్కగా పోస్తాయో, పోయవో అని రెండెకరాలు నాటు పెట్టిన. మూడు బోర్లు పూర్తిగా ఎండిపోయినయ్. మళ్ల మూడు బోర్లు వేసినా సుక్క నీరు రాలే. ఉన్న రెండెకరాలు ఎండిపోతుంటే పాణం తల్లడిల్లింది. పంట చేతికొచ్చే సమయం కాబట్టి రోజూ ట్యాంకర్లు పెట్టి నీరు పోస్తున్నాం. రెండు ఎకరాలకు ఇప్పటికే రెండు లక్షల పెట్టుబడి అయ్యింది. పంటలతోపాటు గొడ్లకు కూడా నీళ్లు కరువైనయి. కరెంట్ సక్కగా రాక, కాల్వల్లో నీరు లేక, బోర్ల నీళ్లు లేక నానా అవస్థలు పడి ఆగమైపోతున్నాం. మమ్మల్ని ఆదుకోవాలె. నాకు ఇప్పటివరకు రైతుబంధు సాయం కూడా అందలేదు' అని గోడును వెల్లబోసుకుంది.

పత్తి విత్తన ప్యాకెట్ ధర రూ.864

- తాజాగా ధర రూ.11 పెంచుతూ కేంద్రం నిర్ణయం

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): పత్తి విత్తన ప్యాకెట్ ధరను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. 450 గ్రాముల ఒక్కో ప్యాకెట్ ధరను రూ.11 పెంచింది. దీంతో ప్రస్తుత సీజన్‌లో ఒక్కో పత్తి ప్యాకెట్ ధర రూ.864కు చేరింది. గత ఏడాది రూ.853గా ఉంది. ఇలా వరుసగా ఐదో ఏడాది పత్తి విత్తనాల ధర పెంచడం గమనార్హం. గతంతో పోల్చితే ప్రస్తుత ధర పెంపు కాస్త తక్కువగా ఉన్నది. నిరుడు ఒక్కో ప్యాకెట్‌పై రూ.43 పెంచిన కేంద్రం ఈ ఏడాది మాత్రం రూ.11 పెంచింది. అయితే దీనిపై విత్తన కంపెనీలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నాయి. ఈ ధరతో నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయలేమని అంటున్నాయి.

కేసీఆర్‌ను దూషించలేదు.. నాపై కేసును కొట్టేయండి

- హైకోర్టులో ఎంపీ అర్వింద్ పిటిషన్

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): విలేకరుల సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అసభ్య దూషించానన్న ఆరోపణలతో తనపై హైదరాబాద్‌లోని అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టివేయాలంటూ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ హైకోర్టును ఆశ్రయించారు. రాజకీయంగా కక్ష సాధించేందుకు ఎలాంటి ఆధారాలు లేకుండా బీఆర్ఎస్ లీగల్ సెల్ కో-కన్వీనర్ రవికుమార్ 2022 ఆగస్టు 18న ఈ కేసును దాఖలు చేశాడని పిటిషన్‌లో పేర్కొన్నారు. 2022 ఆగస్టు 14న ప్రెస్‌మీట్‌లో నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నించానని, అంతే తప్ప కేసీఆర్‌పై ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని తెలిపారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం విచారణ జరుపనున్నారు.

100 రోజులపాలనపై అధిష్ఠానంతో చర్చలు

- సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకతో రేవంత్ భేటీ
- నేడు కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశం
- సీఎం ఢిల్లీకి వెళ్లడం 11వ సారి

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో వేర్వేరుగా సమావేశమయ్యారు. లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక, పార్టీలో చేరికలు, రాష్ట్రంలో వంద రోజుల పాలన తదితర అంశాలపై వారితో చర్చించినట్టు సమాచారం. శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, వంద రోజుల్లో ఆరు గ్యారెంటీల అమలుకు తీసుకున్న చర్యలను వివరించినట్టు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్, నల్లగొండ, జహీరాబాద్, మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన 13 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. వీటికి గతంలో ప్రతిపాదించిన పేర్ల స్థానంలో తాజాగా జరిగిన చేరికల కారణంగా కొన్ని చోట్ల అభ్యర్థులను మార్చాల్సిన అవశ్యకతపై సీఎం పార్టీ పెద్దలతో చర్చించినట్టు తెలిసింది. చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరిన విషయాన్ని వారికి వివరించడంతోపాటు త్వరలో మరికొందరు పార్టీలో చేరనున్నారని చెప్పినట్టు తెలిసింది. చేవెళ్ల నుంచి రంజిత్‌రెడ్డిని బరిలోకి దించి, గతంలో ప్రతిపాదించిన సునీతా మహేందర్‌రెడ్డిని మల్కాజిగిరి నుంచి పోటీ చేయించాలని ప్రతిపాదించినట్టు చెప్తున్నారు. సికింద్రాబాద్ నుంచి దానం నాగేందర్‌ను బరిలోకి దించపడమా? లేక ఆయనకు మంత్రి పదవి ఇవ్వడమా? అనే అంశంపై చర్చించనున్నారని సమాచారం. ఎంపీ అభ్యర్థుల ఖరారుకు ఢిల్లీలో సోమవారం జరగాల్సిన కాంగ్రెస్ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ సమావేశం మంగళవారానికి వాయిదా పడటం, సీడబ్ల్యూసీ సమావేశం కూడా అదే రోజు ఉండటంతో సీఎం రేవంత్‌రెడ్డి అక్కడే ఉంటారని తెలిసింది. సీఎంగా బాధ్యతలు చేపట్టాక రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లడం ఇది 11వ సారి.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో 1.60 లక్షల నష్టం

పురుగుల మందుతాగి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

దిలీప్ (ఫైల్)

శాయంపేట, మార్చి 18: ఇంటర్ విద్యార్థి నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయాడు. దాంతో తండ్రి కి చెప్తే తిడతాడన్న భయంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా శాయంపేట మండలం రాజుపల్లిలో సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామానికి చెందిన ఆవుల దిలీప్(17) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆన్‌లైన్ టెలిగ్రామ్ యాప్‌లో రూ.5 వేలు పెడితే మరో రూ.5 వేలు కలిపి వస్తాయని ఆశపడి పెట్టుబడి పెట్టాడు. ఇలా దిలీప్ ఫేక్ ట్రేడింగ్‌లో రూ.1,60,000 వరకు పెట్టి నష్టపోయాడు. ఈ విషయం తండ్రికి, ఇంట్లో వారికి తెలిస్తే.. ఏమైనా అంటారేమోననే భయంతో దిలీప్ ఈ నెల 3న వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి తల్లిదండ్రులకు ఫోన్‌లో చెప్పాడు. వెంటనే వారు దిలీప్‌ను హైదరాబాద్ నిమ్స్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న దిలీప్ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. కొడుకు మృతిని తట్టుకోలేక తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. తండ్రి ఆవుల శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు.

ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్

కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి విమర్శ

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : ఫిరాయింపులపై బీఆర్ఎస్ స్పీకర్‌కు ఫిర్యాదు చేయడం దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ అని అన్నారు. కాంగ్రెస్, టీడీపీ, బీఎస్పీ, సీపీఐ ఎమ్మెల్యేలను చేర్చుకున్నది బీఆర్ఎస్‌లో కాదా? అని ప్రశ్నించారు. తెలంగాణ పునర్నిర్మాణం పేరుతో ఫిరాయింపులకు శ్రీకారం చుట్టిందే ఆపార్టీ అన్నారు. పదేండ్లలో వివిధ పార్టీలకు చెందిన మొత్తం 39 మంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకున్నారని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకోవడంపై ఫిర్యాదు చేసినా స్పీకర్లు పట్టించుకోలేదని పేర్కొన్నారు.

ఏటీఎం ధ్వంసం.. 8.64 లక్షల అపహరణ

హుజురాబాద్ పట్టణం కోర్టు కాంప్లెక్స్‌లో ఘటన

ఎస్‌బీఐ ఏటీఎంను ధ్వంసం చేసి చోరీకి పాల్పడిన తర్వాత తగులబెట్టిన దుండగులు

హుజూరాబాద్ టౌన్, మార్చి18: కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణం కోర్టు కాంప్లెక్స్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంను గుర్తుతెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి ధ్వంసం చేసి రూ.8.64 లక్షలు దోచుకెళ్లారు. ఏటీఎం మిషన్‌నూ తగులబెట్టారు. ఈ మేరకు ఏటీఎం నెట్‌వర్క్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసచారి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం అర్ధరాత్రి ఏటీఎంలోకి చొరబడిన దుండగులు ఏటీఎంలోని రూ.8,64,100 చోరీ చేశారు. తర్వాత ఆనవాళ్లు దొరకకుండా ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసి తగులబెట్టారు. తెల్లవారుజామున గమనించిన ఏటీఎం అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏసీపీ శ్రీనివాస్ జీ, టౌన్ సీఐ బొల్లం రమేశ్ ఏటీఎంను పరిశీలించారు.

2026 నాటికి డెంగ్యూ వ్యాక్సిన్!

న్యూఢిల్లీ, మార్చి 18: దేశంలో 2026 ఏడాది మధ్య నాటికి డెంగ్యూ వ్యాక్సిన్ వాణిజ్యపరంగా అందుబాటులోకి రానుంది. ఈ వ్యాక్సిన్ సురక్షితపై ఇండియన్ ఇమ్యూనోలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) చేస్తున్న మొదటి దశ ప్రయోగాలు పూర్తయినట్టు ఎండీ కే ఆనంద్ కుమార్ తెలిపారు. రెండు, మూడో దశ పరీక్షలు కూడా త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ సబ్సిడరీ కంపెనీ అయిన ఐఐఎల్ పూర్తి చేసిన మొదటి దశ ప్రయోగాల్లో ఎలాంటి ప్రతికూల ఫలితాలు రాలేదని తెలిపారు. మిగిలిన రెండు దశల ప్రయోగాలు కూడా పూర్తయిన తర్వాత 2026 మధ్య నాటికి వ్యాక్సిన్ వాణిజ్యపరంగా అందుబాటులోకి వస్తుందని చెప్పారు.